# నాకొద్దీ అభ్యుదయం

**ఆంధ్రప్రభ, 8 మే 2000**



అతనికోసం ఎదురు చూడ్డంలో రెండు గంటలు గడిచాయి. నేను అప్రయత్నంగా వాచీ చూసుకున్నాను. తొమ్మిదిన్నరైంది. ఉదయకేసి చూశాను. తప్పు చేసినట్టు తల వంచుకుంది. చాలా డిజప్పాయింటైందని గ్రహించాను.

"సారీ అన్నయ్యా! తప్పకుండా వస్తానని చెప్పాడు. ఎందుచేత రాలేదో! రేపు తనని తీసుకుని మీ ఇంటికి నేనే వస్తాను!" అంది.

"టేకిట్ ఈజీ! ఏదైనా అనుకోని పని తగిలి ఉంటుంది. అతని అడ్రస్సివ్వు, నే వెళ్లి కలుస్తాను!" అన్నాను.

ఉదయ రాసిచ్చింది.

"భోజనం చేసి వెళ్లకూడదూ?" లేస్తుంటే అడిగింది.

"రమ్య ఎదురు చూస్తూంటుంది!" అందామని నాలుక చివరిదాకా వచ్చిన మాటల్ని మింగేశాను. ఉదయ కూడా భోజనం చెయ్యలేదు. నేను నా దారిన వెళ్లిపోతే ఇంక తినదు. ఆకలితో అలాగే ఉండిపోతుంది. తనకి కంపెనీ ఇవ్వడం కోసమైనా నేను తినాలి.

"ఐతే పెట్టు!" అన్నాను. తను కిచెన్‌లోకి వెళ్లింది. నేను ఛెయిర్‌లో రిలాక్సయ్యాను. నా ఆలోచనలుఅతని చుట్టూ తిరుగుతున్నాయి. భాను ప్రకాశ్... పేరుని బట్టి మనిషిని ఊహించుకుందామని ప్రయత్నించాను. ఉదయ అతన్ని ప్రేమిస్తున్నాననీ, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాననీ చెప్పింది.

అతన్ని నాకు పరిచయం చెయ్యటానికని ఏడున్నరకి ఇద్దర్నీ తన ఫ్లాట్‌కి ఆహ్వానించింది. నేనొచ్చాను గానీ, అతను రాలేదు. ఎందుకు? ఏం జరిగుంటుంది? కనీసం ఎందుకు రాలేదో ఫోన్ చేసి చెప్పొచ్చు. కావాలని తప్పించాడా? అదే నిజమనిపించింది నాకు.

సాధారణంగా ప్రేమ వ్యవహారాలు దాగవు. ఏదో ఒక నోటినుంచీ పుకారుగా బయటపడతాయి. అలాంటిది ఉదయ తనంతట తానుగా చెప్పేదాకా ఈ విషయం నాకు తెలియలేదు. అంత రహస్యంగా ఎలా ఉంచగలిగారు? ఇద్దరూ పదే పదే కలుసుకుంటే ఇంటిమసీ పెరిగి, ప్రేమకు దారితీస్తుంది. ఆడా, మగా కలిసి తిరిగినప్పుడు రూమర్స్ రాకుండా ఉండవు. ఇంత సైలెంట్‌గా ఈ వ్యవహారం పెళ్లిదాకా ఎలా వచ్చింది?

ఇందులో ఏదో తిరకాసుందనిపించింది నాకు.

"వడ్డించాను, రా అన్నయ్యా!" ఉదయ పిలుపుతో నా ఆలోచనలకు బ్రేకు పడింది. లేచి వెళ్లాను. డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని నిశ్శబ్దంగా తింటున్నాము. ఒక విధమైన ఉదాసీన వాతావరణం మా మధ్య చోటుచేసుకుంది.

వంటకాలు చాలా రుచిగా ఉన్నా మస్తిష్కంలోని ఆలోచనల చేత నాలుక వాటి రుచిని

గుర్తించలేకపోతోంది.

"ఏమైనా కబుర్లు చెప్పన్నయ్యా!" నిశ్శబ్దాన్ని భరించలేక అనుకుంటూ, చిన్నపిల్లలా అడిగింది.

"ఈ వారంలో నేను పర్మాలవైపు క్యాంప్‌కి వెళ్లాలి. బహుశాః నాలుగైదురోజులు పడుతుందేమో తిరిగి రావడానికి!" అన్నాను.

"రమ్య ఒక్కర్తీ ఏం ఉంటుందీ? వెళ్తూ వెళ్తూ ఇక్కడ డ్రాప్ చెయ్యకూడదూ?"

"వాళ్ల పేరెంట్స్ దగ్గరకి వెళ్తుందట. పది రోజులు లీవ్ పెట్టింది. బాగా వీక్‌గా ఉంది. రెస్ట్ తీసుకుంటే బావుంటుందని...!" సందిగ్ధంగా ఆగిపోయాను.

"ఏమిటి అనారోగ్యం?" ఆదుర్దాగా అడిగింది.

ఈ విషయాలు తనతో చర్చించాలంటే నాకు కాస్త ఇబ్బందిగా ఉంటుంది. తను నా స్వంత చెల్లెలు కాదు. చిన్నాన్న కూతురు. నాకన్నా రెండేళ్లు చిన్నది. నా భార్యకన్నా నాలుగేళ్లు పెద్దది. జాబ్ చేసుకుంటూ ఇండిపెండెంట్‌గా ఉంటోంది. తను ఈ ఊరొచ్చి దాదాపు మూడేళ్లయింది. అంతకుముందు మా మధ్య ఓ మోస్తరు పరిచయం ఉండేది. అది తనీ ఊరొచ్చాక బలపడింది. తనకి ఏ ప్రాబ్లం వచ్చినా నాతో చెప్తుంది. నా అభిప్రాయాలని పూర్తిగా మన్నిస్తుందని నేననుకోనుగానీ, మనవాళ్లకి చెప్పుకోవటం ద్వారా పొందే రిలీఫ్‌ని తను నాద్వారా పొందుతుంది. ఇప్పుడు తన ప్రశ్నకి జవాబు చెప్పటం ఇబ్బందిపూర్వకమైన విషయమే. ఎందుకంటే రమ్యకి ఫోర్త్‌మంత్.

"ఏమీ లేదు, జనరల్ వీక్‌నెస్!" క్లుప్తంగా అన్నాను అసలు విషయం దాచిపెట్టి. వీధిలో వినిపించే పెళ్లి బాజాలకే అప్సెటౌతూంటుంది ఉదయ. అలాంటిది ఈ విషయం తనలో ఎంత సంచలనం రేపుతుందో ఊహించగలు. ఐతే అది జెలసీ మాత్రం కాదు. గుండె లోతుల్లోంచీ ఎగదన్నుకొచ్చే ఆవేదన, తీరని ఆశాభంగం!

"నేను క్యాంప్‌నుంచీ రాగానే అతన్ని కలుస్తాను!" చెయ్యి కడుక్కుంటూ అన్నాను. ఉదయ టవల్ తెచ్చిచ్చింది. ఏదో చెప్పాలని నా ముఖంలోకి చూసి ఆగిపోయింది.

"రమ్యని ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమను. వాళ్లకి ఆఫీసులో వర్క్ బాగా ఉంటుందట. ఇంటి పనుల్లో నువ్వు కొంచెం హెల్ప్ చెయ్యకూడదూ?" అంది. అదంత తటపటాయించి చెప్పే విషయం కాదే? ఏదో చెప్పాలనుంది తనకి. మనసుకీ, వాక్కుకీ మధ్యనున్న ఇనుప తెర తొలగదేం?

నా వెంట బయట స్కూటర్‌దాకా వచ్చింది. "ఈ విషయం మా నాన్నకి తెలియనీకు!" చీకట్లో తన గొంతు వణికింది.

"ఉదయా!" విస్మయంగా అన్నాను.

"జరిగినవన్నీ నాకు తెలుసు. వచ్చిన ప్రతి మేచ్‌నీ నాన్నే చెడగొట్టాడు. నా సంపాదన కావాలాయనకి. అవన్నీ నాకు తెలిశాక... వాళ్లకి దూరంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఇప్పటికి ప్రశాంతంగా బతుకుతున్నాను. నాకు... నా క్కూడా పెళ్లి చేసుకుని సెటిలవ్వాలనుంది. పెళ్లి చేసుకోకూడనంత తప్పు పని నేనేం చెయ్యలేదుగా?"

తన కళ్లల్లో తడి మెరవటాన్ని నేను స్పష్టంగా చూశాను. తనెందుకంత డిటాచ్డ్‌గా ఉంటుందో అర్థమైంఅది. పేరెంట్స్ దగ్గరే దొరకని సెక్యూరిటీ బయటి వాళ్ల దగ్గర ఎలా దొరుకుతుందని ఆశించి ఎటాచ్‌మెంట్స్ పెంచుకుంటుంది?

"జరిగిందేదో జరిగిపోయింది. ఇకమీదట అంతా మంచే జరుగుతుంది. ఊరునుంచీ రాగానే వెళ్లి అతన్ని కలిసి అన్నీ మాట్లాడతాను. నువ్వేం వర్రీ అవకు. బై. గుడ్ నైట్!" అని చెప్పి

స్కూటర్ స్టార్ట్ చేశాను. దాదాపు పది నిమిషాలు పట్టింది నాకు ఇల్లు చేరడానికి. భోజనం చెయ్యకుండా నా కోసం ఎదురుచూస్తోంది రమ్య.

"ఇంత లేటైందేం? రండి, అన్నం పెట్టేస్తాను. నాకు ఆకలి దంచేస్తోంది!" అంది నన్ను చూడగానే.

"ఇంత రాత్రిదాకా తినకుండా ఎందుకు కూర్చున్నావు? లేటవుతుందేమోనని కూడా చెప్పాను కదా!" కోప్పడ్డాను మెత్తగా.

"ఒక్కదానికీ తినాలనిపించలేదు."

"నా భోజనం అయిపోయింది. రెండు అప్పడాలు వేయించి ఇవ్వు. తింటూ మాట్లాడుకుందాం!" అన్నాను. తను లోపలకి వెళ్లిపోయింది. నేను ఛేంజై, డైనింగ్ టేబుల్ దగ్గరకి వెళ్లాను. ఒక కంచం పెట్టి అందులో పదార్థాలన్నీ వడ్డించాను. ఇంతలో తను అప్పడాలు వేయించి తెచ్చి కంచం ముందు కూర్చుంది.

"ఇలా ఎప్పుడూ చెయ్యకు, రమ్యా! బయటకు వెళ్లాక ఒక్కొక్కసారి సిట్యుయేషన్ మన చేతుల్లో ఉండదు!" గిల్టీగా అనిపించి మరోసారి మందలించాను.

"అతన్ని చూశారా? ఎలా ఉన్నాడు?" నవ్వేసి, మాట మార్చేసింది. కాజువల్‌గా కాదు, కుతూహలంగానే అడిగింది భానుప్రకాష్ గురించి.

"అతను రాలేదు!" అన్నాను.

"అదేమిటీ?" తెల్లబోయి నమ్మలేనట్టు అడిగింది.

"కనీసం ఫోన్ చేసి కూడా చెప్పలేదు."

"... ..."

"ఉదయతో నేనింకాఅనలేదు కానీ, కావాలనే రాలేదేమోననిపిస్తోంది!" అన్నాను. "పాపం చాలా డిసప్పాయింటైంది."

"పెళ్లి చేసుకోవాలని ఆమెకి చాలా ఉంది."

"తప్పా మరి?"

"తప్పెందుకవుతుంది? మీ మగాళ్ల వైఖరి పెళ్లి విషయంలో ఏమిటో గానీ, ఆడవాళ్లకి మాత్రం కష్టం సుఖం పట్టించుకునే మనిషొస్తాడని సంతోషం. ఇంత లేటైనా ఇంకా మీరు రాలేదని నేను కంగారుపడుతూ కూర్చున్నాను. ఆకలితో ఉన్నానని మీరొచ్చి నాకోసం బాధపడ్డారు. అంటే తోడూ నీడా అన్నమాట!"

పెళ్లి గురించి ఎంత బాగా చెప్పింది రమ్య! పెళ్లంటే ఒకళ్లకోసం ఒకళ్లు ఆలోచించుకోవటం, ఒకళ్లనొకళ్లు అర్థం చేసుకుని ఆరాటపడటమన్న మాట!

"వదినకి మీ వయసుంటుందా? చదువుకుంది. జాబ్ చేస్తోంది. అనాకారి కాదు. అసలింతదాకా పెళ్లెందుకవలేదు? మీ బాబాయిగారు పట్టించుకోరెందుకని?" అడిగింది. మేము ఈ విషయాలు ఎప్పుడూ చర్చించుకోలేదు. అలాంటి సందర్భం ఇంకా రాలేదు.

"నాకన్నా చిన్నది. ఉద్యోగం కొంతమంది ఆడవాళ్లకి శాపం. ఆ కొద్దిమందిలో తనూ ఉంది."

"అంటే!"

"అంతే!"

★★★

నేను నాలుగు రోజులనుకున్నది పరకాలలో వారం రోజులు ఉండాల్సి వచ్చింది. ఊరునుంచి తిరిగి వచ్చి ఇంటి తాళం తీస్తుంటే ఎలాగో అనిపించింది. రమ్య లేని ఇల్లు

ఖాళీగా, కళావిహీనంగా కనిపించింది. మా పెళ్ళై రెండేళ్ళైందంతే. అప్పుడే మా ఇద్దరి మధ్యా ఎంత ఎటాచ్‌మెంట్ పెరిగింది. ఈ పాటికి తనక్కడ నా కోసం బెంగపెట్టుకుని ఉంటుంది. మా ఇంటికి వెళ్ళిపోతానని గొడవ చేస్తూంటుందేమో బహుశా!

నా ఇల్లూ, నావాళ్ళూ! ఎంత అందమైన భావన అది! ఇల్లంటే నాలుగ్గోడలు కాదు. మనం నిష్క్రమిస్తే చైతన్యరహితమై, మన పునరాగమనంతో మళ్ళీ ఉత్తేజాన్ని పుంజుకునే పరిసరాలు. అలాంటి పరిసరాలతో మమేకం చెందే మనుషులు! ఇలాంటి అనుబంధం భార్యాభర్తలు పిల్లల మధ్యనే సాధ్యపడుతుంది. నాకు ఇలా ఆలోచిస్తుంటే ఉదయ గుర్తొచ్చింది. ముప్పయ్యేళ్ళ ఉదయ... పదేళ్ల సర్వీసూ, ఆరువేల జీతం ఉన్న ఉదయ... పాపం, ఒంటరితనంతో ఒంటరిగా దశాబ్దంగా పోరాడుతోంది.

భానుప్రకాశ్‌కి ఫోన్ చెయ్యాలి. టైమ్ చూసుకున్నాను. ఐదు కావటానికి చాలా వ్యవధి ఉంది. ఫోన్ చేసి, అతనుంటే వస్తానని చెప్పటానికి సరిపడా టైముంది. మాకింకా ఫోన్ రాలేదు. ఇంటెదురుగా పబ్లిక్‌బూత్ ఉంది. అక్కణ్ణుంచి అతని ఆఫీసుకి రింగ్ చేశాను.

ఎవరో ఎత్తారు. అతను లేడట. లీవు పెట్టాడట. మామగారు పోతే, భార్యాపిల్లల్ని తీసుకుని ఊరెళ్లాడట. అతను ఫౌల్ ప్లే చేస్తున్నాడేమోనన్న అనుమానం నాకు మొదట్లోనే కలిగింది కాబట్టి పెద్దగా షాక్ అనిపించలేదు. ఇలా జరక్కుండా ఉంటే బావుండేదని మాత్రం అనుకున్నాను.

ఇప్పుడున్న సమస్యల్లా ఒక్కటే ఉదయ నెలా ఫేస్ చెయ్యాలి? అది రెండు వైపులా పదునున్న కత్తిలా నాలోకి దిగబడి తన ప్రతాపాన్ని చూపించసాగింది. అతనికి పెళ్లయిన విషయం ఉదయకి ముందే తెలుసా? తెలిసే రెండో భార్యగా ఎడ్జస్టయిపోదామనుకుందా? ఉద్యోగం చేస్తూ ఆడవాళ్ల ఏదైనా సాధించారేమో నాకు తెలియదు కానీ, కొన్ని కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొంత మంది అమ్మాయిలు పెళ్లి అనే చట్రంలో ఇమడలేకపోతున్నారు. ఫ్రీ లైఫ్‌కి అలవాటుపడి, పెళ్లి చేసుకోవటం ద్వారా వచ్చి పడే బాధ్యతలకి కొందరు భయపడుతున్నారు. ఉదయకి లాగే ఏవో కారణాలచేత పెళ్లవని వాళ్లు కొందరు. ఇలాంటి వాళ్లలో చాలామంది వివాహితుణ్ణి చేసుకోవడానికి ఇష్టపడుతున్నారట. 'ద్వితీయం' అనేది తమ సమస్యలకి ప్రత్యామ్నాయ పరిష్కారంగా భావిస్తున్నారు. అలాంటి కొందర్లో ఉదయ కూడా ఉందా? లేక తనకింకా ఏమీ తెలియదా?

నా ఆలోచనలు ఎటూ తేలక ఉదయని కలవటాన్ని రెండు రోజులు వాయిదా వేశాను. ఇంతలో తనే ఫోన్ చేసింది రమ్మని. వెళ్లాను. నేను వెళ్లేసరికి ఉదయ వంటింట్లో ఉంది.

"కూర్చో, వచ్చేస్తున్నాను!" అక్కణ్ణుంచే చెప్పింది.

నేను సోఫాలో కూర్చుని టీపాయ్‌మీద పేపరు తిరగేయసాగాను. ఈ విషయం ఎలా ప్రస్తావించాలా అనే ఆలోచన నా బుర్రని తినేస్తోంది. ఇంతలో మృదువైన అడుగుల చప్పుడికి తల తిప్పాను. తనే! తెల్లటి దుస్తుల్లో ఉంది. ఆ బట్టలు ఆమె తనకై తను తీసుకున్న ఏదో నిర్ణయాన్నిచూచాయగా తెలియజేస్తున్నాయి.

"ఎప్పుడొచ్చావన్నయ్యా ఊర్నుంచీ?" తనూ కూర్చుంటూ అడిగింది.

"మొన్నే..."

"రమ్య కులాసాయా? వాళ్లమ్మగారింటి నుంచీ తిరిగొచ్చిందా?"

"ఇంకా రాలేదు."

ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తూ నేనేదీ అడిగే అవకాశం ఇవ్వకుండా జవాబు మాత్రమే చెప్పించుకుంటోంది. అది తనలో చెలరేగే సంఘర్షణని అణచిపెట్టుకునే ప్రయత్నమని నేను గ్రహించేలోపుగా తనే బరస్టయింది.

"బ్రహ్మకుమారీ దీక్ష తీసుకున్నాను!" అంది. ఒక మంచుతరంగం నా నిలువెల్లా పాకిపోయింది. ఈ ఆశ్రమం గురించి నాకు కొద్దిగా తెలుసు. దీక్ష తీసుకున్నవాళ్లు సాంసారిక సుఖాలకీ, పెళ్లికీ దూరంగా ఉంటారు. వాళ్ల సిద్ధాంతాలు వైదిక సిద్ధాంతాలకి కొంచెం భిన్నంగా ఉంటాయి. అద్వైతానికీ దూరంగానే ఉంటాయి.

"అదేమిటి ఉదయా?" అన్నాను ఇంకేమనాలో తోచక.

"ఆరోజు వస్తానని భానుప్రకాశ్ రాకపోయేసరికి నాకు చాలా డిప్రెసింగ్‌గా అనిపించింది. వాళ్లాఫీసుకి ఫోన్ చేశాను. నాన్నని దృష్టిలో ఉంచుకుని మా అఫైర్ సీక్రెట్‌గా ఉంచమని కోరినది నేనే కాబట్టి అతను ప్రికాషన్సేమీ తీసుకోలేదు. ఆ ఒక్క ఫోన్ కాల్‌తో అతని వ్యవహారం అంతా బయటకొచ్చింది."

"అందుకే కాంప్‌నుంచీ రాగానే నిన్ను కలవలేకపోయినది. నేనూ అతనికోసం ఫోన్ చేశాను."

"ఈ ఊరొచ్చినప్పట్నుంచీ ఏది చేసినా నీకు చెప్పి చేస్తున్నాను. ఈ విషయంలోకి కూడా నిన్ను డ్రాగ్ చేశాను కాబట్టి నీకు నా నిర్ణయాన్ని చెప్పాల్సిన బాధ్యత ఉంది."

"చేశాకా, చెప్పటం?"

"డిపెండబులిటీ... ఇల్లు, పెళ్లి, పిల్లలూ అనే వ్యవహారాల్లోకి తల దూరిస్తే ఒక మగవాడి సాహచర్యం అనివార్యమవుతోంది. మగవాడంటే ఎవరు? నిలువెత్తు స్వార్థపు ముద్ద... నిన్ను కాదు నేననేది. జనరలైజ్ చేసి చెప్తున్నాను."

"సరే గానీ, ఈ నిర్ణయం ఏమిటి?"

"అదే చెప్పబోతున్నాను... తనకెలాంటి స్వార్థమూ లేనట్టూ మరొకరికోసం పాటుపడుతున్నట్టూ కనిపించడానికి భార్యా పిల్లలనే కవచం వేసుకుంటాడు. ఆ కవచంలో తను సెక్యూర్డ్‌గా ఉంటాడు."

"అందరూ అలాగే ఉంటారా ఉదయా?" అని అడిగాను గానీ, నా ప్రశ్న నాకే అసంబద్ధంగా అనిపించింది. ఉదయ జీవితంలో ముఖ్యమైన స్థానాన్ని తీసుకున్న ఇద్దరు మగవాళ్లూ... ఒకరు తన తండ్రి, మరొకరు ఈ భానుప్రకాశ్ స్వార్థాన్నే చిలికించారు. అలాంటప్పుడు ఆమె అభిప్రాయంలో తప్పు లేదు. తను నా ప్రశ్నని పట్టించుకోలేదు.

"నేను చదువుకుని ఉద్యోగం చెయ్యటంచేతనే నాన్నలో స్వార్థం మొదలైంది. నా నిస్సహాయతను ఎడ్వాంటేజ్‌గా తీసుకోవాలని భానుప్రకాశ్‌లో కోరిక కలిగింది. అతను నాతో తను విడోయర్ననీ, పిల్లలు లేరనీ చెప్పాడు".

"హౌ డేర్?!"

"అలా నావైపు నుంచి అడిగేవాళ్లు లేరనే అతని ధైర్యం. నిన్ను పరిచయం చేస్తాననగానే

తోక ముడిచేశాడు. కానీ, అన్నయ్యా! నేను ఏ ఉద్యోగం లేని ఆడపిల్లననుకో, నాన్న తినో, తినకో ఇంత మిగిల్చి నాకు పెళ్లిచేసి పంపించేసేవాడు. ఆ వచ్చిన వ్యక్తి ఎవరైనా అతనేం చేసినా అదే సంతోషం అనుకుంటూ గడిపేసేదాన్ని."

"అలా కూడా కష్టాలు పడుతున్నవాళ్లు ఉన్నారు కదమ్మా!"

"కష్టం, సుఖం, లేక సంతోషం... ఇవి మనిషి జ్ఞానానికీ, జీవనసరళికీ సంబంధించినవి. పూట గడవటమే కష్టంగా ఉన్నవాడికి పట్టెడన్నం సునాయాసంగాదొరకడం సుఖం, నెహ్రూలాంటి స్కాలర్స్‌కి పుస్తకం చదవలేకపోవటం అనేది సంభవిస్తే దాన్ని మించిన కష్టం మరొకటి ఉండదు. ఏమీ తెలియని అజ్ఞానంలో ఉన్నప్పుడు అన్యాయం కూడా న్యాయబద్ధంగానే కనిపిస్తుంది. ఒకవేళ అన్యాయంలాగే తోచినా ఖర్మ అని సరిపెట్టుకుంటారు. ఇప్పటి ఆడవాళ్లు చదువుకుని ఉద్యోగం చేస్తూ కూడా మగవాడి స్వార్థానికి రకరకాలుగా బలైపోతున్నారు. అలా బలైపోతున్నామని తెలిసీ ఏమీ చెయ్యలేకపోతున్నారు"

"చెప్పు, ఉదయా! ఇన్ని తెలిసినదానివి నిన్ను నువ్విలా శిక్షించుకోవటమేమిటి?"

"ఇది శిక్షించుకోవటమెలా అవుతుంది? పెళ్లి చేసుకోకూడనంత పెద్ద తప్పు నేనేం చేశానని ఆరోజు చీకట్లో నిన్నడిగాను. భానుప్రకాశ్ భార్యాపిల్లల కోణంలోంచి ఆలోచిస్తే దానంత పెద్ద తప్పు అదే గానీ, మరొకటి లేదనిపిస్తోంది. మగవాడితో ప్రమేయం లేని జీవితాన్ని...అదర్ధవంతంగా గడపాలనుకుంటున్నాను."

నన్ను నేను శోధించుకున్నాను. ఎందుకంటే, నేనూ మగవాణ్ణే. నాలో కూడా ఎక్కడో ఒకచోట స్వార్థం ఉండే ఉంటుందా? పెళ్లి చేసుకున్నప్పటి నుంచీ రమ్యకి ఫెయిత్‌ఫుల్ హజ్బెండ్‌గానే ఉంటున్నాను. తనని ప్రేమగానే చూసుకుంటున్నాను... పెళ్లి... రమ్య... తిరకాసేదో ఇక్కడే ఉందనిపించింది. నాకు కావాల్సినంత కట్నం తెచ్చింది కాబట్టి రమ్యని నేను పెళ్లి చేసుకున్నాను. లేకపోతే నా భార్యస్థానంలో మరో ఆడపిల్ల ఉండేది. అంటే నా అనుబంధం డబ్బుతోనే గానీ, భార్య అనే మనిషితో కాదు. నెలనెలా జీతం తెచ్చి నా చేతికిస్తూ నా అవసరాలు చూస్తోంది గాబట్టి రమ్యని నేను ప్రేమగా చూసుకుంటున్నాను. అంటే ఇక్కడ నా అనుబంధం వ్యక్తితో కాదు, నా అవసరాలు తీర్చగలగటంతో ఇంతకన్నా పెద్ద స్వార్థం ఎక్కడా ఉండదు. ఉదయ అన్నట్టు కష్టసుఖాలు జీవనసరళికీ, మనో వికాసానికీ సంబంధించినవి. నేనుగానీ, రమ్యగానీ.. మరో భార్యాభర్తలుగానీ ఒకరినొకరు ప్రేమించటం అనేది ఇలానే నేర్చుకున్నాం. అదే ప్రేమ, అన్యోన్యత అనుకుంటున్నాం. ఇది తప్పనీ, భార్య అనే వ్యక్తిని నేను ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నానీ తెలియదు కాబట్టి టేకిట్ ఫర్ గ్రాంటెండ్‌గా భావించాను.

నేను ఆలోచనలో నిమగ్నమై ఉండటం చూసి తనే మళ్లీ అంది ఉదయ "నా సమస్యకి ఇది పరిష్కారంగా భావించటంలేదు. డబ్బు సంపాదించగలగటమే ఆడవాళ్లు సాధించిన అభ్యుదయమైతే అలాంటి అభ్యుదయం నా కొద్దు. ఎవరికో సంపాదనా యంత్రాన్ని కాలేను.. నా జీతమే, నాలోని ప్రేమాస్పదమైన అంశమని అనుకునే మనుషుల్ని నేను ప్రేమించలేను. నా సంపాదనతో నిమిత్తం లేకుండా నన్ను నన్నుగా ప్రేమించే వ్యక్తుల మధ్యకి వెళ్తున్నాను."

ఉదయ నిర్ణయంలోని మంచి చెడులు నిర్ణయించే స్థానంలో నేను లేను. ఆ అర్హత కూడా నాకు లేదేమో! కానీ ఒక ప్రశ్న. అభిమానం దెబ్బతిన్న ప్రతి స్త్రీ ప్రత్యామ్నాయ సమాజాన్ని

వెతుక్కుంటే, ప్రస్తుతం సమాజం ఏమవుతుంది?

నేను లేచి నిలబడ్డాను. "నేను నీనుంచి ఏదీ ఆశించలేదు. స్నేహాన్ని మాత్రమే పొందాను. నేను స్వార్థపరుణ్ణో కాదో నిర్ణయించవలసింది రమ్య. ఆ ఇష్యూతో నీకిప్పుడు ప్రమేయంలేదు. అన్నగానో, స్నేహితుడిగానో నన్ను గుర్తుపెట్టుకో. ఏ అవసరం వచ్చినా ఏది కష్టమనిపించినా నాతో చెప్పుకోవడం మానకు!" అన్నాను.

ఉదయ చిరునవ్వు నవ్వింది. అది బాధాపరితాపాలచేత ప్రక్షాళనమైన, స్వచ్ఛమైన నవ్వు.